


sahanamvande.com
epaper.sahanamvande.com
# సహనం వందే
హైదరాబాద్ | 19-10-2026 సోమవారం | సంపుటి-02 సంచిక : 175 EDITOR: ROHINI




# ఇండియన్ మైండ్... విదేశీ బ్రాండ్

## గూగుల్, మైక్రోసాఫ్ట్... మన వద్ద ఏవీ?


సత్య నాదెళ్ల

**సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల... ఈ పేర్లు వింటే ప్రవాస భారతీయులుగా మన గుండె గర్వంతో ఉప్పొంగిపోతుంది. ప్రపంచాన్ని శాసించే పెద్ద టెక్ కంపెనీలకు మనోళ్లే బాస్‌లుగా ఉంటే ఆ మాత్రం గర్వం ఉండడంలో తప్పులేదు. కానీ, ఒక్క నిమిషం ఆలోచిద్దాం. మనోళ్లు బయట దేశాలకు వెళ్తేనే అంతటి అద్భుతాలు సృష్టిస్తున్నారు. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న భారతదేశంలో... మన స్వదేశీ వ్యాపారాలు ప్రపంచ స్థాయిలో ఎందుకు పోటీ పడలేకపోతున్నాయి? విదేశాల్లో మనోళ్ల విజయం వెనుక... మన దేశంలో ఉన్న లోపాల అసలు కథేంటి?**
**- సహనం వందే, హైదరాబాద్**

- గ్లోబల్ స్థాయిలో ఎదగని భారత్ కంపెనీలు
- రీసెర్చ్ శూన్యం... కాపీ పేస్టులకే పరిమితం
- చట్టాల చక్రబంధం... స్టార్టప్‌ల పలాయనం!
- సత్తా ఉండి సాధించలేని దౌర్భాగ్య పరిస్థితి
- ప్రభుత్వాల నిర్లక్ష్యం... ఆవిష్కరణలు శూన్యం

గూగుల్, మైక్రోసాఫ్ట్, అడోబ్ వంటి ఎన్నో బహుళజాతి కంపెనీల పగ్గాలు మనోళ్ల చేతిలోనే ఉన్నాయి. మన దేశంలో సరైన అవకాశాలు, ప్రోత్సాహకర వాతావరణం లేకపోవడం వల్లే అత్యంత ప్రతిభావంతులు విదేశాలకు వెళ్తున్నారు. అక్కడ లభించే స్వేచ్ఛ, వ్యవస్థాగత మద్దతుతోనే వారు అంతర్జాతీయ విజేతలుగా మారుతున్నారు. మన ఆర్థిక వ్యవస్థ విలువ రూ. 300 లక్షల కోట్లకు పైగానే ఉన్నప్పటికీ, గ్లోబల్ 500 లేదా ఫోర్బ్స్ జాబితాలో ప్రభావం చూపే భారతీయ కంపెనీలు వేళ్లమీద లెక్కపెట్టొచ్చు.

### రెడ్ టేపిజం నిబంధనల సంక్లిష్టత

మన దేశంలో ఒక పెద్ద వ్యాపారాన్ని ప్రారంభించి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం అంత తేలిక కాదు. సంక్లిష్టమైన నిబంధనలు, రెడ్ టేపిజం, అనుమతుల సాధనలోనే సగం శక్తి అయిపోతుంది. విదేశాల్లో వ్యాపార నిర్వహణ పారదర్శకంగా, వేగంగా జరుగుతుంది. సరైన లీగల్ సపోర్ట్ లేకపోవడంతో మన దేశంలో పుట్టిన అనేక స్టార్టప్‌లు కూడా తమ ప్రధాన కార్యాలయాలను విదేశాలకు మార్చేస్తున్నాయి.

### పరిశోధన పెట్టుబడుల్లో తీవ్ర నిర్లక్ష్యం...

పరిశోధన, అభివృద్ధి (ఆర్&డీ) విషయంలో మన కంపెనీలు వెనుకబడి ఉన్నాయి. కొత్త ఆవిష్కరణలు చేయడం కంటే, ఉన్నదానిని కాపీ చేయడం లేదా సేవా రంగానికి పరిమితం కావడం ఎక్కువైంది. అమెరికా, చైనా దేశాలు రీసెర్చ్ కోసం వేల కోట్లు ఖర్చు చేస్తుంటే, మన దగ్గర స్వల్పకాలిక లాభాల పైనే దృష్టి ఎక్కువ. దీర్ఘకాలిక ఆవిష్కరణలపై పెట్టుబడులు తక్కువగా ఉండటం వల్ల మన సంస్థలు అంతర్జాతీయ టెక్ దిగ్గజాలుగా మారలేకపోతున్నాయి.

### విద్యా వ్యవస్థ నైపుణ్యాల లోపం

మన విద్యా వ్యవస్థకు, పరిశ్రమల అవసరాలకు మధ్య పెద్ద వ్యత్యాసమే ఉంది. ఏటా లక్షల మంది ఇంజనీర్లు బయటకు వస్తున్నా పరిశ్రమలకు ఉపయోగపడే నైపుణ్యాలు ఉన్నవారు తక్కువ. గూగుల్ లాంటి కంపెనీలు ఆలోచనా స్వేచ్ఛకు ప్రాధాన్యత ఇస్తే, మన దగ్గర పాతకాలపు వర్కింగ్ కల్చరే నడుస్తోంది. దీనికి తోడు పెద్ద కంపెనీలు కుటుంబ పాలనలోనే సాగుతూ ప్రొఫెషనల్స్‌కు నిర్ణయాధికారాలు ఇవ్వకపోవడం కూడా వ్యాపార విస్తరణను దెబ్బతీస్తోంది.

### రిస్క్ క్యాపిటల్ పాలసీల లోపాలు

సిలికాన్ వ్యాలీలో కొత్త ఆలోచనలకు భారీగా వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ లభిస్తాయి. కానీ మన దేశంలో పెట్టుబడిదారులు తక్కువ రిస్క్ ఉన్న రంగాలకే మొగ్గు చూపుతారు. మరో వైపు పన్నుల వ్యవస్థ, నిబంధనల్లో తరచూ వచ్చే మార్పులు వ్యాపారవేత్తలను భయపెడుతున్నాయి. పాలసీల్లో స్పష్టత, స్థిరత్వం లేకపోవడం వల్ల వ్యాపారాలు ప్రపంచ స్థాయిలో ఎదగలేకపోతున్నాయి.

### గ్లోబల్ విజన్ పెరగాల్సిన అవసరం

మన దేశంలో జనాభా ఎక్కువ కాబట్టి స్వదేశీ మార్కెట్‌పైనే ఆధారపడి చాలా కంపెనీలు సంతృప్తి పడుతున్నాయి. వేరే దేశాలకు విస్తరించాలనే గ్లోబల్ విజన్ లేకపోవడం వల్ల భారతీయ బ్రాండ్లు గ్లోబల్ బ్రాండ్లుగా మారలేకపోతున్నాయి. భారతదేశం గ్లోబల్ లీడర్‌గా మారాలంటే కేవలం విదేశాలకు సీఈఓలను ఎగుమతి చేస్తే సరిపోదు, ఇక్కడే వెయ్యి గూగుల్‌లు, మైక్రోసాఫ్ట్‌లు పుట్టుకొచ్చేలా వాతావరణం కల్పించాలి.

### వ్యవస్థలోని లోపాలకు అద్దం...

విదేశాల్లో మనవాళ్ల విజయాలు మన నైపుణ్యానికి నిదర్శనం. కానీ స్వదేశంలో ఎదురవుతున్న అవరోధాలు వ్యవస్థలోని లోపాలకు అద్దం పడుతున్నాయి. భారతీయులు వేరే దేశాలకు వెళ్తేనే గ్లోబల్ లీడర్లు కాగలరా? మన దేశంలోనే అలాంటి ప్రపంచ స్థాయి కంపెనీలను ఎప్పుడు చూడబోతున్నాం?


సుందర్ పిచాయ్

# మోడీని గద్దె దింపే కుట్ర!

## కేంద్ర మంత్రి రిజిజు సంచలన వ్యాఖ్యలు

**మన దేశంలో రాజకీయాలు ఎప్పుడు ఎలా మారుతాయో ఎవరికీ అంతుచిక్కదు. ఏదైనా ఉద్యమం వస్తే చాలు, ప్రభుత్వం పడిపోతుందనో లేక దేశంలో పెద్ద మార్పు వస్తుందనో కొందరు కలలు కంటుంటారు. కానీ, మన దేశం బంగ్లాదేశ్, ఫ్రాన్స్ కాదని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ప్రతిపక్షాలు, విదేశీ శక్తులు మన దేశంలో అల్లర్లు సృష్టించేందుకు పెద్ద కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వాల మార్పు కేవలం ఎన్నికల ద్వారానే సాధ్యమని, రోడ్లపై హింసతో గద్దె దించాలనుకోవడం భ్రమే అవుతుందని తేల్చిచెప్పారు.**
**- సహనం వందే, న్యూఢిల్లీ**

- విదేశీ శక్తుల కుట్రల ఉందని కామెంట్
- బంగ్లాదేశ్, ఫ్రాన్స్ తరహా కుట్ర ఉందని వెల్లడి
- సర్ నిరసనలతో అట్టుడుకుతున్న ఇండియా
- దేశంలో అల్లర్లు సృష్టించేందుకు భారీ ప్లాన్


కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

ఈ యాంటీ-సర్ నిరసనల వెనుక అసలు కథ ఏమిటంటే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ ప్రతిపక్షాలు తీవ్ర నిరసనలు తెలుపుతున్నాయి. ముఖ్యంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు, వివిధ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఢిల్లీలోని జంతర్ మంతర్, ఇతర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. ఓటర్ల జాబితా నుంచి లక్షలాది మంది పేర్లు తొలగించారంటూ ప్రతిపక్షాలు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

### విపక్షాలపై అధికార పార్టీ దాడి...

ఈ నిరసనల ఉధృతిని చూసి కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఇవి కేవలం సాధారణ నిరసనలు కాదని, దీని వెనుక దేశాన్ని అస్థిరపరిచే పెద్ద కుట్ర దాగి ఉందని కేంద్ర మంత్రి రిజిజు విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచ వేదికపై దేశ కీర్తి ప్రతిష్టలు పెరుగుతుంటే ఓర్వలేక విపక్షాలు టుక్రీ-టుక్రీ గ్యాంగ్‌లా వ్యవహరిస్తూ రోజూ డ్రామాలు ఆడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.

### ప్రశాంత్ భూషణ్ వివాదాస్పద కామెంట్లు

మరోవైపు... ఈ వివాదంలో సీనియర్ అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్, స్టూడెంట్ లీడర్స్ చేసిన కామెంట్లు మరింత నిప్పు రాజేసాయి. ప్రభుత్వ మార్పు అనేది ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కు అని, ఈ దేశంలో పాలనా మార్పు జరగాలని కోరుకోవడంలో తప్పులేదని ప్రశాంత్ భూషణ్ సమర్థించారు. ఎలక్టోరల్ డెమోక్రసీని రక్షించుకోవడానికి తాము పోరాడుతున్నామని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసంతృప్తిని వెళ్లగక్కడం నేరం కాదని ఆయన వాదించారు.

### కట్టుదిట్టంగా భద్రతా బలగాల పహారా

ఢిల్లీలో జరుగుతున్న ఈ ఆందోళనలు, మార్చ్‌ల నేపథ్యంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ నవంబర్ 1వ తేదీన రామ్‌లీలా మైదాన్‌లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తుండగా, మరోవైపు మహిళా సంఘాలు కూడా వేర్వేరు అంశాలపై ఆందోళనలకు దిగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండటానికి భద్రతా బలగాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. నిరసనల పేరుతో ఎక్కడైనా హింస చెలరేగితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### రాజ్యాంగ బద్ధమైన పరిష్కారమే ముఖ్యం

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, కానీ దానిని అడ్డుపెట్టుకొని దేశాన్ని అశాంతికి గురిచేయడం క్షమించరాని నేరమని బీజేపీ మద్దతు దారులు అభిప్రాయపడుతున్నారు. ఏ సమస్య ఉన్నా చర్చల ద్వారా లేదా రాజ్యాంగ బద్ధమైన పద్ధతుల ద్వారా పరిష్కరించు కోవాలితప్ప రోడ్లపై విధ్వంసం సృష్టించడం సరికాదు. రాను న్న రోజుల్లో రాజకీయ వేడి మరింత పెరిగేలా కనిపిస్తున్నప్పటికీ, విదేశీ శక్తులు లేదా కుట్రపూరిత అల్లర్లు మన వ్యవస్థను బలహీనపరచలేవని, ఏ ప్రభుత్వమైనా ప్రజల తీర్పుతోనే రావాలని అంటున్నారు.

# కోడి కూరలో చచ్చిన బల్లి

## ఖమ్మంలోని ఒక దాబాలో దారుణం

- సిరిసిల్లలో ఒక స్వీట్ షాపులో మిక్చర్‌లో బల్లి
- ప్రజల ప్రాణాలతో కల్తీ నేరగాళ్ళ చెలగాటం
- రసాయనాల రంగుతో కుళ్లిపోయినా రుచే
- తూతూమంత్రం తనిఖీలు... చావు కేకలు

**మీరు హోటళ్లకు, దాబాలకు వెళ్తున్నారా? అయితే ఈ నిజం వింటే మీ కడుపులో ఉన్నదంతా కక్కేస్తారు! అవును... మనం ఎంతో ఇష్టంగా తినే చికెన్ కూరలో చచ్చిన బల్లులు తేలుతున్నాయి. కాలుష్యం, కల్తీ మయం అయిన ఈ తిండి చూస్తే ఒళ్లు జలదరించక మానదు. ప్రజల ప్రాణాలను గాలికి వదిలేసి డబ్బుల కోసం విషం వడ్డిస్తున్న ఈ కల్తీ కేటుగాళ్ల బండారాన్ని బట్టబయలు అవుతోంది.**
**- సహనం వందే, హైదరాబాద్**



ఖమ్మంలోని ఒక దాబాలో కస్టమర్ ఆర్డర్ చేసిన చికెన్ కూరలో చచ్చిపోయిన బల్లి ప్రత్యక్షమవడంతో అధికారులు ఆ దాబాను సీజ్ చేశారు. అలాగే సిరిసిల్లలో ఒక స్వీట్ షాపులో మిక్చర్‌లో చనిపోయిన బల్లి రావడం అక్కడి దారుణ పరిస్థితులకు అద్దం పడుతోంది. సిరిసిల్లలోని తంగళ్లపల్లి మండేపల్లి, అంకుసాపూర్‌లో పానీపూరి తిని ఏకంగా 24 మంది అస్వస్థతకు గురయ్యారంటే ఈ తిండి ఎంత ప్రమాదకరంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి ఘోరాలు జరుగుతున్నా నిర్వాహకులకు మాత్రం కనీస సిగ్గు లేకుండా పోయింది.

### కుళ్లిన మాంసంతోనే వంటకాలు...

కామారెడ్డి జిల్లా భిక్నూరు, సదాశివనగర్ ప్రాంతాల్లోని దాబాల్లో గడువు ముగిసిన కుళ్లిన సరుకులు, అత్యంత అపరిశుభ్రమైన వాతావరణాన్ని అధికారులు గుర్తించారు. ఇక మెదక్ జిల్లా రామాయంపేట దాబాలో అయితే ఏకంగా కుళ్లిన మాంసంతోనే వంటకాలు తయారు చేసి ప్రజలకు వడ్డిస్తున్న వైనం వెలుగు చూసింది. రోడ్లపై ప్రయాణించే అమాయక ప్రయాణికుల ప్రాణాలతో వీరు చేస్తున్న చెలగాటం అత్యంత హేయమైనది.

### కుళ్లిన మాంసంపై ఫినాయిల్...

నిజామాబాద్ జిల్లా బోధన్‌లో కుళ్లిన కోడి మాంసంపై ఏకంగా ఫినాయిల్ చల్లుతున్న దృశ్యాలు చూస్తే ఎవరికైనా గుండె ఆగిపోవాల్సిందే. కామారెడ్డిలో కుళ్లిన మేక, కోడి మాంసాన్ని అధికారులు పట్టుకుని జరిమానాలు వేశారంటే పరిస్థితి ఎంత దిగజారిందో ఆలోచించండి. పైకి మాత్రం మెరిసే లైట్లు, ఆకర్షణీయమైన సీటింగ్‌తో కస్టమర్లను ఆకర్షించే ఈ హోటళ్లు... లోపల వంటగదిలో మాత్రం ఈగలు, బొద్దింకల మధ్య నరకయాతనను తలపించేలా వంటలు వండివారుస్తున్నాయి.

### బిర్యానీకి ఆకర్షణీయమైన రంగు...

కంటికి ఇంపుగా, నాలుకకు రుచికరంగా కనిపించడం కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. బిర్యానీకి ఆకర్షణీయమైన రంగు తేవడం కోసం క్యాన్సర్ కారకమైన విషపూరిత సింథటిక్ రంగులను ఇష్టానుసారంగా కలుపుతున్నారు. చైనీస్ ఫుడ్, సూప్‌లలో విపరీతంగా అజినోమోటో వాడటం వల్ల నరాల బలహీనత, తీవ్రమైన తలనొప్పి బారిన పడుతున్నారు. రుచి పేరుతో మన శరీరంలోకి స్లో పాయిజన్ పంపిస్తున్నా ప్రశ్నించే వారు లేకుండా పోయారు.

### చట్టాలు ఉన్నప్పటికీ నామమాత్రమే...

చట్టాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు మాత్రం నామమాత్రంగానే ఉంటోంది. కల్తీ రుజువైతే లక్ష నుండి 5 లక్షల వరకు జరిమానా, 8 నెలల జైలు శిక్ష, మరణాలు సంభవిస్తే జీవిత ఖైదు వంటి నిబంధనలు ఉన్నా ఆచరణలో మాత్రం కేవలం చేతులు దులుపుకునే చర్యలే కనిపిస్తున్నాయి. అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేసి వెళ్లడం వల్ల ఈ కల్తీ రాయుళ్లలో ఎలాంటి భయం లేకుండా పోయింది. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది.

### టెస్టింగ్ సెంటర్స్ ఏవీ?

సేకరించిన ఆహార నమూనాలను పరీక్ష కోసం హైదరాబాద్‌లోని నాచారానికి పంపాల్సి వస్తుండగా... ఆ రిపోర్ట్ రావడానికే నెలల సమయం పడుతోంది.

ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు కలిపి కేవలం ఒక్కటే నమూనా సేకరణ వాహనం ఉందంటే మన ప్రభుత్వ యంత్రాంగం ఎంత నిర్లక్ష్యంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఇదే కల్తీ వ్యాపారులకు కొండంత ధైర్యాన్ని ఇస్తోంది. ఈ నేపథ్యంలో కల్తీని ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైంది.